ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 35.7 • కనిష్ఠం 20.7




ఘనంగా ఆంజనేయ ఆలయ వార్షికోత్సవం



నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బుధవార్‌పేట్ శ్రీ ఆంజనేయ శివ పంచాయతన దేవాలయ 11వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తులసి భానుమూర్తి శర్మ ఆధ్వర్యంలో యజ్ఞ పూజారి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు గంట రాకేష్, అనుముల మోహన్, శ్రీధర్, కృష్ణ పాల్గొన్నారు.

పంచాయతీ పోరుపై ఉత్కంఠ



- షెడ్యూల్ కోసం జిల్లాలోని ఆశావహుల ఎదురుచూపులు
- నేడో రేపో వెలువడనున్న ప్రకటన
- రెండు విడతలుగా ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
- జిల్లాలో మొత్తం 4,40,651లక్షల ఓటర్ల నమోదు
- నోటిఫికేషన్ వరకు ఇంకా నమోదు కోసం అవకాశం
- 42శాతం రిజర్వేషన్‌ల ప్రకటనతో బీసీల్లో కొత్త ఉత్సాహం

నిర్మల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే ప్రభుత్వం ఎన్నికల నిర్వహణ దిశగా దృష్టి కేంద్రీకరించడమే కాకుండా అందుకు అనుగుణంగా ఏర్పాట్లను కూడా వేగంగా చేస్తోంది. కలెక్టర్ అభిలాష అభినవ్ ఇప్పటికే జిల్లాలోని 400 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ పదవితో పాటు వార్డు సభ్యుల ఎన్నికపై పూర్తిస్థాయి కసరత్తు చేశారు. ఇందుకు అనుగుణంగా జిల్లాలో రెండు విడతలుగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. గతంలో ఈ ఎన్నికలను మూడు విడతలుగా నిర్వహించగా ఈ సారి మాత్రం రెండు విడతలకే పరిమితం చేయాలని భావిస్తున్నారు. జిల్లాలో మొత్తం 4,45,651లక్షల మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. కాగా కొత్తగా నమోదైన ఓటర్లు 3802 మంది మాత్రమే ఉన్నారు. కాగా ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే వరకు కూడా ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నారు. కాగా మొత్తం 4,45,651 మంది ఓటర్లుకు గాను మహిళ ఓటర్లు ఈ సారి అధికంగా ఉన్నారు. 2,30,641 మంది మహిళ ఓటర్లు ఉండగా , 2,09,995 మంది పురుష ఓటర్లు ఉండడం గమనార్హం. రెండు రోజుల క్రితం రాష్ట్ర ప్రభుత్వం బీ.సీ జనాభా లెక్కలను అధికారికంగా ప్రకటించడమే కాకుండా అధికార కాంగ్రెస్ పార్టీ బీ.సీలకు ఈసారి స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్‌లను అమలు చేస్తామంటూ ప్రకటించింది. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలని ఆశిస్తున్న బీ.సీ నేతలంతా సంబురపడుతున్నారు. చాలా సంవత్సరాల నుంచి ఆధిపత్య ధోరణి కారణంగా తమకు స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లభించలేదని, రిజర్వేషన్‌ల పుణ్యమా అంటూ ఈ సారి అవకాశం లభించబోతోందంటూ పేర్కొంటున్నారు.

రెండు విడతల్లో..

కాగా జిల్లాలో రెండు విడతల్లో పంచాయతీ ఎన్నికలను నిర్వహించేందుకు అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. ఓటర్ల జాబితాలు వెలువరించడం, ఎన్నికలు నిర్వహించే అధికారుల నియామక ప్రక్రియ, వారికి శిక్షణ కార్యక్రమాలు లాంటి చర్యలను మొదలుపెట్టారు. అలాగే కొద్ది రోజుల్లోనే సిబ్బందిని కూడా నియమించేందుకు రంగం సిద్ధం చేశారు. నిర్మల్ జిల్లాలో మొదటి విడత కింద తొమ్మిది మండలాల్లో ఎన్నికలు నిర్వహించబోతున్నారు. మొత్తం తొమ్మిది మండలాలకు గానూ 202 గ్రామ పంచాయతీలు, 1661 వార్డుల్లో ఈ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఖానాపూర్, పెంబి, కడెం, దస్తురాబాద్, మామడ, లక్ష్మణచాంద, నిర్మల్ రూరల్, సోన్, సారంగాపూర్ మండలాలను మొదటి విడత కింద ఎంపిక చేశారు. రెండో విడత కింద మొత్తం 198 గ్రామ పంచాయతీలు, 1712 వార్డు సభ్యుల పదవులకు ఎన్నికలు జరపనున్నారు. దిలావర్‌పూర్, నర్సాపూర్(జి), లోకేశ్వరం, కుంటాల, భైంసా, కుబీర్, తానూర్, ముథోల్, బాసర మండలాల్లో ఎన్నికలు చేపట్టబోతున్నారు.

పకడ్బందీ ఏర్పాట్లు..

గ్రామ పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు కలెక్టర్‌తో పాటు జిల్లా పంచాయతీ అధికారి గత కొద్ది రోజుల నుంచి సీరియస్‌గానే కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లాలో 3368 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయబోతున్నారు. 2004 మంది ప్రిసైడింగ్ అధికారులు, 2764 మంది అదర్ ప్రీసైడింగ్ అధికారులను నియమించనున్నారు. అలాగే ఆర్‌ఓలు, ఏఆర్‌ఓల నియామక ప్రక్రియ కూడా పూర్తి చేశారు. వీరందరికి హైదరాబాద్‌లో శిక్షణను ఇస్తున్నారు. అ యితే ఎన్నికల సంఘం వారం రోజుల్లోనే గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్ జారీ చేసే అవకాశాలున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. దీనికి అనుగుణంగానే ప్రభుత్వ వర్గాల నుంచి కూడా ఎన్నికలకు సంబంధించి సంకేతాలు వస్తుండడంతో ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్న వారితో పాటు ప్రభు త్వ యంత్రాంగమంతా ఆ దిశగా సంసిద్ధమవుతోంది.

కీలకంకానున్న బీ.సీ రిజర్వేషన్‌లు

ఇదిలా ఉండగా రాష్ట్ర ప్రభుత్వం బీ.సీ జనాబా సర్వే లెక్కల వివరాలను అధికారికంగా వెల్లడించడంతో ఆ వర్గాలకు రిజర్వేషన్‌ల శాతం పెరగబోతోంది. ఇందులో భాగంగానే కాంగ్రెస్ పార్టీ ఒక అడుగు ముందుకు వేసి 42శాతం బీ.సీలకు రిజర్వేషన్‌లను అమలు చేస్తామంటూ ప్రకటించడంతో ఇతర పార్టీలు సైతం అదే బాటను అనుసరించేసే అవకాశం ఉందంటున్నారు. రిజర్వేషన్‌ల పెంపు వ్యవహారంతో బీ.సీలంతా ఈ సారి ఎక్కువ సంఖ్యలో పోటీ చేసేందుకు సిద్దమవుతున్నారు. పల్లెల్లో బీ.సీ వర్గాల నుంచి పోటీ చేసే వారంతా ఇక తమ వంతు ప్రయత్నాలను ముమ్మరంగా మొదలు పెట్టారు. కాంగ్రెస్ పార్టీ బీ.సీలకు 42 శాతం టికెట్‌లు ఇస్తామంటూ ప్రకటించిన నేపథ్యంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల వైఖరిపై కూడా అంతటా ఆసక్తి నెలకొంటోంది. మొత్తానికి వారం పది రోజుల్లో పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కాబోతున్నట్లు సంకేతాలు వెలువడుతున్న నేపథ్యంలో ఇక పల్లెల్లో ఓట్ల పోరు ముమ్మరం కాబోతోందని అంటున్నారు.



గ్రామ పంచాయతీ ఎన్నికలకు

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం

• శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి



ఈ విషయమై జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌ను సంప్రదించగా గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం అన్ని రకాల ఏర్పాట్లను చేస్తున్నామన్నారు. జిల్లాలో 3,368 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, గత అక్టోబరు మాసం నుంచి డిసెంబరు 31 వరకు కొత్తగా 3,802 ఓటర్లను నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. గతంలో గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు విడుతలుగా జరిపామని, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం రెండు విడుతలుగా నిర్వహిస్తే.. ఎలా ఉంటుందని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆయా జిల్లా కలెక్టర్లను ఆదేశించడం జరిగిందని ఆయన వివరించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను రెండు విడుతలుగా నిర్వహించేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు ఆయన వివరించారు.

అక్కకొండ

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



తహసీల్దార్‌కు ఆహ్వానాన్ని అందజేస్తున్న అక్కకొండ ఆలయ కమిటీ బృందం

ఖానాపూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : కడెం మండలం దిల్దార్‌నగర్, సారంగాపూర్ గ్రామాల పరిధిలోని అడవుల్లో గల శ్రీ అక్క కొండ లక్ష్మీ నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని ఖానాపూర్ తహసీల్దార్ సుజాతకు ఆలయ కమిటీ బృందం ఆహ్వానం పలికింది. ఈ మేరకు బుధవారం ఖానాపూర్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుజాతను కలిసిన ఆలయ కమిటీ బృందం ఆమెకు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ నెల 8వ తేదీ నుంచి 14వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 9వ తేదీన స్వామివారి కల్యాణోత్సవం, 12వ తేదీన రథోత్సవం, జాతర నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఇట్టి కార్యక్రమాలకు హాజరుకావాలని తహసీల్దార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బృందం కోల శ్రీనివాస్, జగ్గారావు, శ్రీనివాస్, రాజన్న, వినయ్, తదితరులున్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం



సారంగాపూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గల వంజర్‌లో బుధవారం హిందూవాహిని ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు రాజశేఖర్ రెడ్డి, శివకుమార్‌లు వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కొంత మంది వ్యాధిగ్రస్తులను చికిత్స నిమిత్తం కోసం నిర్మల్ ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో హిందూవాహిని కార్యకర్తలు, గ్రామస్థులు ఉన్నారు.

అక్కాపూర్

రేణుక ఎల్లమ్మ గుడిలో చోరీ



ఆలయ హుండీ తాళం విరగొట్టిన దృశ్యం

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ మండలం అక్కాపూర్ గ్రామ సమీపంలో ఉన్న నిర్మల్ గీత పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ మాత ఆలయంలో చోరీ జరిగింది. మంగళవారం అర్ధరాత్రి ఆలయం గేటుతో సహా అమ్మవారి ప్రధానద్వారం బద్దలు కొట్టి అమ్మవారి మీద ఉన్న నగలు దోచుకుపోయారు. అలాగే ఆలయ హుండీని కూడా పగలగొట్టి దొంగలు నగదు దోచుకున్నారు. ఆలయ నిర్వాహకుల అభిప్రాయం ప్రకారం సుమారు మూడు లక్షలకు పైగా దొంగలు ఎత్తుకుపోయారని నిర్వాహకులు తెలిపారు. దొంగలు వ్యూహాత్మకంగా ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కూడా ధ్వంసం చేశారని తెలిపారు.

అగ్ని ప్రమాదంలో

పశువుల కొట్టం దగ్ధం



అగ్ని ప్రమాదంలో దగ్ధమైన పశువుల కొట్టం

సారంగాపూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గల లింగాపూర్ తాండలో మంగళవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో తొడసం పులారి అనే రైతు పశువుల కొట్ట దగ్ధమైనట్లు తాండ వాసులు తెలిపారు. ఈ అగ్ని ప్రమాదంలో పశువు మృతి చెందగా మరో పశువుకు తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. వీటితో పాటు వ్యవసాయ పనిముట్లు, పశుగ్రాసం ఖాళీ బూడిదైనట్లు తెలిపారు. ఈ అగ్ని ప్రమాదంలో రూ. 2 లక్షల నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని తాండ వాసులు పేర్కొంటున్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎల్లపల్లి గ్రామానికి చెందిన అల్లోల గోవర్ధన్‌రెడ్డి తల్లి మరణించడంతో వారి కుటుంబ సభ్యులను, లక్ష్మణచాంద మండలం రాచాపూర్ గ్రామంలో గల న్యాయవాది నాయుడు ప్రసాద్ మరణించడంతో వారి కుటుంబ సభ్యులను బుధవారం జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు అల్లూరి మల్లారెడ్డి, తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు అల్లూరి కృష్ణవేణి పరామర్శించారు. వీరి వెంట మండల పార్టీ అధ్యక్షులు గంగాధర్, సూర్యనారాయణ రెడ్డి ఉన్నారు.

జాతీయ నులి పురుగుల నివారణ దినాన్ని విజయవంతం చేయాలి

• కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్ హాజరైన అధికారులు

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఈ నెల 10వ తేదీన నిర్వహించబోయే జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం రోజున 1 నుండి 19 సంవత్సరాల వయసు గల వారందరికీ నులి పురుగులను నివారించే ఆల్బెండజోల్ మాత్రలను అందించాలన్నారు. ఈ మాత్రల ద్వారా పిల్లల్లో రక్తహీనత సమస్య తగ్గుతుందన్నారు. విద్యాశాఖ, ఏఎన్ఎం, అంగన్‌వాడీలు సమన్వయంగా పని చేసి ఏ ఒక్కరికి విడిచి పెట్టకుండామాత్రలను అందివ్వాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు, అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇచ్చి, వయసుల వారీగా మాత్రల డోస్ ఇవ్వాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోను మాత్రలు ఇంటికి ఇవ్వరాదన్నారు. భోజనం తర్వాతనే ఆల్బెండజోల్ మాత్రలను వేయించాలన్నారు. మాత్రలు వేసే ప్రదేశంలో తగినంత త్రాగునీరు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రత్యేక షెడ్యూల్‌ను ఏర్పరచుకొని నులి పురుగుల నిర్మూలన మాత్రలను అందరికీ అందివ్వాలన్నారు. ప్రజలకు ఆల్బెండజోల్ మాత్రల ఉపయోగంపై విస్తృతం అవగాహన కల్పించి, పిల్లలందరూ మాత్రలు తీసుకునేలా ప్రోత్సహించాలన్నారు. 10వ తేదీన మాత్రలు తీసుకోని వారికి 17వ తేదీన మాప్ అప్ డే నిర్వహించి మాత్రలను అందించాలన్నారు. జిల్లాలో దాదాపు 1 లక్ష 96 వేల మంది 1 నుంచి 19 సంవత్సరాల వయసు గలవారు ఉన్నారని తెలిపారు. అనంతరం జిల్లాలో గల ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రుల్లో జరుగుతున్న వైద్య చికిత్సల వివరాలపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... నిర్మల్, ఖానాపూర్, భైంసా, నర్సాపూర్(జి) ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేలా కృషి చేయాలన్నారు. ఆయా ఆసుపత్రుల్లో ఇప్పటి వరకు జరిగిన సిజేరియన్, సాధారణ ప్రసవాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సురక్షిత ప్రసవాలు జరుగుతాయనే నమ్మకం ప్రజల్లో కల్పించాలని తెలిపారు. సాధారణ కాన్పులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రుల్లో అవసరమగు వైద్య పరికరాలు, సిబ్బంది వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో రాజేందర్, డీఈవో పి. రామారావు, సీపీవో జీవరత్నం, డీపీవో శ్రీనివాస్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, ఎస్సీ సంక్షేమ అధికారి రాజేశ్వర్ గౌడ్, మెప్మా పీడీ సుభాష్, ఏసీడీపీవో నాగలక్ష్మి, వైద్యాధికారులు, వైద్యులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించకుండా చైర్మన్ ఛాంబర్‌కు తాళం

• ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ



మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ గదికి తాళం వేస్తున్న కమిషనర్

ఖానాపూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున మున్సిపల్ కార్యాలయలో గల చైర్మన్ ఛాంబర్‌కు తాళం వేసినట్లు మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్ల పదవి కాలం ముగిసిన నేపథ్యంలో ఏ రాజకీయ నాయకులు కూడా నిబంధన ప్రకారం చైర్మన్ ఛాంబర్‌లోకి రాకూడదని అయన పేర్కొన్నారు. సమస్యలు ఉంటే మున్సిపల్ కమిషనర్ వద్దకు వచ్చి తెలియజేయాలే తప్పా ఇదివరకు వలే కార్యాలయం లోపల ఉన్న మున్సిపల్ చైర్మన్ గదికి గానీ పాలకవర్గ సమావేశాలు నిర్వహించే హాల్‌లోకి గానీ వెళ్లి ఎటువంటి సమావేశాలు నిర్వహించవద్దన్నారు. తాను కార్యాలయంలో లేని సమయంలో కూడా ఎవరు నిబంధనలు ఉల్లంఘించకుండా ఉండేందుకు మున్సిపల్ చైర్మన్ గదికి తాళం వేసినట్లు అయన పేర్కొన్నారు. అధికారిక కార్యక్రమాలు ఉన్నప్పుడు మాత్రమే ఆ గదిని ఉపయోగిస్తామని అయన పేర్కొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుకు వ్యతిరేకంగా

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నిరసన

• భైంసాలో భారీ నిరసన ర్యాలీ • ప్రధాని మోదీకు వ్యతిరేకంగా ప్రదర్శనలు • ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

భైంసా, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ ప్రక్రియలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాలలకు తీరని అన్యాయం చేశాయని ఆరోపిస్తూ ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి భైంసాలో ఆందోళనలు చేపట్టింది. బుధవారం మధ్యాహ్నం ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ముథోల్ నియోజక వర్గ అధ్యక్షులు శంకర్ చంద్రే, ప్రధాన కార్యదర్శి విఠల్ కాంబ్లేల నేతృత్వంలో సమితి శ్రేణులు నిరసన ర్యాలీ చేపట్టాయి. స్థానిక బుద్ధవిహార్ ప్రాంతం నుంచి ప్రారంభమైన నిరసన ర్యాలీ బస్టాండ్ వరకు. అక్కడి నుంచి అర్‌డీవో కార్యాలయం వరకు కొనసాగింది. ర్యాలీలో సమితి శ్రేణులు ప్రధానిమోదీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బస్టాండ్ ఎదుట ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఎస్సీ వర్గీకరణను 2025 జనాభా లెక్కల ప్రతిపాదికన చేపట్టాలనే డిమాండ్‌తో కూడిన వినతిపత్రాన్ని ఆర్‌డీవో కోమల్ రెడ్డికి అందచేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ముథోల్ నియోజక వర్గ అధ్యక్షులు శంకర్‌చంద్రే, ప్రధాన కార్యదర్శి విఠల్‌కాంబ్లేలు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణ అంశంలో మాల, మాల ఉపకులాలను అణగదొక్కే తీరుతో వ్యవహరించాయని దుయ్యబట్టారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 2011 జనాభా లెక్కల ప్రకారం మాల, మాల ఉపకులాల సంఖ్యను తక్కువ చేసి నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టారని ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వ తీరుతో రాష్ట్రంలోని మాల,మాల ఉపకులాల వారికి అన్ని విధాలుగా తీరని అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2025 సంవత్సరములో జనాభా గణన నిర్వహించి అందులోని ఎస్సీ జనాభాను ప్రతిపాదికగా తీసుకొని వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి ఆధ్వర్యంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు దిగి వచ్చేంత వరకు రాజీలేని రీతిలో అవిశ్రాంత పోరుబాట కొనసాగిస్తామన్నారు. ప్రసంజిత్ అగ్రే, గౌతం పింగ్లే, దేవిదాస్ హస్డే పాల్గొన్నారు.

విషాదంలోనే ఇంటర్ ప్రయోగ పరీక్షలు రాసిన విద్యార్థిని



కుటుంబ సభ్యులతో ఇంటర్ ప్రయోగ పరీక్షకు హాజరైన విద్యార్థిని

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఓ వైపు తండ్రి తిరిగి రాని లోకాలకు వెళ్లాడు. మరోవైపు ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతున్నాయి. కుటుంబం విషాదంలో ఉండగా దుఃఖాన్ని దిగమించుకొని పరీక్ష రాసిన విద్యార్థిని ఉదాంతం చూపరులను కంటతడి పెట్టించింది. వివరాల్లోకి వెళ్తే తానూర్ మండలం బోసి గ్రామానికి చెందిన రైతు ధర్మన్న మంగళవారం గుండెపోటుతో చనిపోయాడు. దీంతో కుటుంబం విషాదంలో మునిగిపోయింది. ఈ నేపథ్యంలో ధర్మన్న కుమార్తె చందాల రాజశ్రీ బుధవారం పట్టణంలోని దీక్ష జూనియర్ కళాశాలలో ప్రాక్టికల్ పరీక్షలకు హాజరైంది. బంధువులు, కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు సానుభూతి వ్యక్తం చేశారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సోమ శ్రీనివాస్

నర్సాపూర్(జి), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సోమ శ్రీనివాస్ మాట్లాడుతూ... పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉండి అక్రమ రవాణా అరికట్టాలన్నారు. కార్యదర్శులు, ప్రజలు ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని విజిలెన్స్ టీం వారికి సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సాయికిరణ్, గిర్దావర్ వేణుగోపాల్, సుమలత, కార్యదర్శులు కైలాస్, గంగాజల, నవనీత్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

కడెం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రమేష్ డిమాండ్ చేశారు. కడెంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీలను రెగ్యులర్ చేసి పేస్కేల్ వర్తింపజేయాలన్నారు. వేసవిలో వారికి సెలవులు ఇవ్వాలని కోరారు.

ఎమ్మెల్సీ స్థానానికి ఒక్క నామినేషన్

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు బుధవారం ఒక నామినేషన్ దాఖలైంది. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం దేవునిగూడకు చెందిన గవ్వల శ్రీకాంత్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతికి నామినేషన్ అందజేశారు. ఇప్పటి వరకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి నలుగురు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి తొమ్మిది మంది నామినేషన్లు దాఖలు చేశారు.

నేడు వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం

జైనథ్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కూర గ్రామంలో గురువారం జరిగే వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవానికి ఆలయం వివిధ రంగు రంగుతో ముస్తాబైయింది. ఇందులో భాగంగా ఆలయంలో కొలువుదీరిన శ్రీవేంకటేశ్వర స్వామి, పద్మావతి, అలివేళి మంగమ్మ విగ్రహాలను వివిధ పట్టు వస్త్రాలతో పాటు బంగారు, వెండి ఆభరణాలతో అలంకరించారు. ఈ సందర్భంగా యాగాశాల ప్రవేశం నిర్వహించి పలు జంటలతో కలిసి హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేళతాళాలతో గరుడ కల్యాణోత్సవం, ప్రసాదాన్ని, ధ్వజరోహణ, చక్రసాన్న అర్చన నిర్వహించారు. ఇందులో ప్రధాన అర్చకులు గుడిపాటి రామంజనేయులు, తదితరులున్నారు.

'ప్రభుత్వ భూములను కాపాడాలి'

ఉట్నూర్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండలంలోని లింగోజి తండా, షాంపూ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు కాపాడాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి సెడ్మకి రామారావు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి ఆదివాసీ సంక్షేమ పరిసత్ నాయకులు చేరుకొని తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఇందులో అర్క ఓమేష్, మరప శంభు, ఆత్రం మారుతి, అరక గంగారాం, కనక జైవంతరావు, వెడమశేఖర్, అర్క విజయ్, తదితరులున్నారు.

ఎంపీ దృష్టికి టవర్ల నిర్మాణం : బోరే

బోథ్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): బోథ్ నియోజకవర్గంలో మంజూరి అయిన బీఎస్ఎన్ఎల్ టవర్ల నిర్మాణం జాప్యంపై జిల్లా ఎంపీ జి.నగేష్ దృష్టికి తీసుకెళ్తామని టెలికాం డైరెక్టర్ బోరే రవీందర్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని వజ్జర్ గ్రామపంచాయతీ పరిధిలోని పలు గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా అర్ధాంతంగా ఆగిపోయిన సెల్‌ఫోన్ టవర్ల నిర్మాణ జాప్యం విషయమై ఆరా తీశారు. అటవీశాఖ అనుమతులు రాకపోవడంతో టవర్ల నిర్మాణం నిలిచిపోయిందని గ్రామస్థులు తెలపడంతో ఈ విషయమై ఎంపీ దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

● రేషన్ షాప్ ఏర్పాటుకు చర్యలు

సెల్‌ఫోన్ సిగ్నల్ లేకపోవడంతో రేషన్ బియ్యం కోసం మహదుగుడ పాత గ్రామ పంచాయతీలోని ప్రజలు రేషన్ బియ్యం కోసం 12కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తుందని గ్రామస్థుల ద్వారా తెలుసుకోవడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. అయితే సిగ్నల్ వ్యవస్థ లేకపోవడం వల్ల రేషన్ బియ్యం పంపిణీలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని గుర్తించడం జరిగిందన్నారు. అయితే స్థానికంగా రేషన్ షాప్ ఏర్పాటు కావాలంటే సెల్‌ఫోన్ సిగ్నల్స్ అవసరమని పేర్కొన్నారు.

'ఎమ్మెల్యే ప్రతిపాదనతోనే నిధుల మంజూరు'

బోథ్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): బోథ్ నియోజకవర్గ అభివృద్ధికి జీవో నెంబర్ 78 ద్వారా ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ కింద 15 కోట్ల రూపాయల నిధులు స్థానిక శాసనసభ్యులు జాదవ్ అనిల్ ప్రతిపాదనతో మంజూరు అయ్యాయని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మజార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం నిధుల మంజూరుకి సంబంధించిన విషయాన్ని వివరించారు. అభివృద్ధిని ఓర్వలేక కాంగ్రెస్ పార్టీ నాయకులు తాము మంజూరు చేయించినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. స్థానిక శాసనసభ్యుల సిఫారసు మేరకు నిధులు మంజూరు అవుతాయి అన్న విషయం కాంగ్రెస్ పార్టీ నాయకులకు తెలియని విషయం కాదన్నారు. ప్రతిపక్షంలో ఉన్న ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న ఎమ్మెల్యేని చూసి ఓర్వలేక తప్పుడు ప్రచారం చేయడం కాంగ్రెస్ పార్టీ నాయకులకు తగదని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

కాంగ్రెస్ నమ్మించి మోసం చేసింది

● మాల సంఘం నేతల మండిపాటు ● సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాల దహనం ● ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా ఆందోళనలు



ఆదిలాబాద్‌లో సీఎం ఫ్లెక్సీతో నిరసన తెలుపుతున్న నేతలు



ఉట్నూర్‌లో సీఎం చిత్రపటాలను దహనం చేస్తున్న నాయకులు

ఆదిలాబాద్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం మాలలను నమ్మించి మోసం చేసిందని ఆ సంఘం నేతలు మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లుకు క్యాబినెట్ ఆమోదం తెలుపడంతో మాలలు ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకపడ్డారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలిపి సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలను దహనం చేసే ప్రయత్నం చేయగా.. పోలీసులు అడ్డుకున్నారు. దీంతో స్వల్ప ఉద్రిక్తత పరిస్థితులకు దారి తీసింది. పోలీసులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వెంటనే వర్గీకరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంత్రుల సబ్ కమిటీలో మాల ప్రతినిధులు లేకుండానే ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించిందని ఆరోపించారు. మాదిగ సమాజానికి వత్తాసు పలుకుతున్న ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. నామ్‌కే వాస్తేగా ఏకసభ్య కమిషన్‌ను వేసి ప్రభుత్వమే ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కేవలం ప్రభుత్వం నమ్మించేందుకే దరఖాస్తులు తీసుకుంది కానీ, మాలల మనోభావాలను పరిగణలోకి తీసుకోలేదని జిల్లా సంఘం అధ్యక్షుడు కొప్పుల రమేష్ పేర్కొన్నారు. ఇందులో సంఘ నాయకులు మేకల మల్లన్న, మెట్టు ప్రహ్లాద్, సుధీర్, సుధాకర్, ముల్కలరాజేశ్వర్, అశోక్, మేదరి స్వామి, పాశం రాఘవేంద్ర, నల్ల రాజేశ్వర్, ముచ్చరఘు, మలపతి సుభాష్, జగదీశ్, తదితరులున్నారు.

● మాల నేతకాని మహర్ నాయకుల నిరసన

ఉట్నూర్: ఎస్సీ వర్గకరణలో భగంగా ఏబీసీ గ్రూపులుగా విభజించడాన్ని నిరసిస్తూ మాల నేతకాని మహర్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటాలను దహనం చేస్తూ నిరసన తెలపారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్‌చౌరస్తాలో తెలంగాణ అసెంబ్లీ శాసనసభ, విధానసభలలో వర్గీకరణను ఆమోదించడాన్ని నిరసిస్తూన్నామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలను కాల్చివేస్తూ సీఎం డౌన్‌డౌన్ నినాదాలు చేశారు. ఇందులో కాటం రమేష్, సింగరేభరత్, వాఘ్మారేజగ్జీవన్, దూట మహేందర్, జాడి వెంకటేశ్‌నేత, తొటి ఆశన్న, ముకుంద్, తదితరులు పాల్గొన్నారు.

● అంబేద్కర్ విగ్రహానికి నాయకుల వినతి

బోథ్: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించడం నిరసిస్తూ బుధవారం మండల కేంద్రంలో మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా చట్టబద్ధత కల్పించిన ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎలుక రాజు, జాయింట్ సెక్రెటరీ మునేశ్వర సోమన్న, ఉపాధ్యక్షుడు సందీప్, కోశాధికారి బోడ లక్ష్మణ్, గ్రామ కమిటీ అధ్యక్షులు సురేందర్, ఉపాధ్యక్షులు ఉషన్న, కనుగుట్ట, కుసులాపూర్ గ్రామాల కమిటీ అధ్యక్షులు కొట్టాటి స్వామి, భూమేష్, తదితరులున్నారు.

నేరడిగొండ: ఎస్సీ వర్గీకరణ బిల్లుకు రాష్ట్ర ప్రభుత్వం చట్టబద్ధత కల్పించడంపై మండల కేంద్రంలో బుధవారం మాల మహర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మాల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు నారాయణ స్వామి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను రాజ్యాంగబద్ధంగా చేయాలని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం జాయింట్ సెక్రటరీ అడెల్లు, జిల్లా బాధ్యులు కుర్మే నారాయణ స్వామి, పోశెట్టి, నవీన్, సుధాకర్, లక్ష్మణ్, మహర్ నాయకుడు అడెల్లు, రాఘవులు అభిలాష్, వసంత్, తదితరులు పాల్గొన్నారు.

తలమడుగు: ఎస్సీ వర్గీకరణ బిల్లును నిరసిస్తూ బుధవారం మండల కేంద్రంలో మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ప్రధాన కూడలి వద్ద పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం నాయకులు నేతుల గంగన్న, భూత దేవన్న, కాడే శ్రీనివాస్, ఎలుగు ఆనంద్, మాజీ ఎంపిటిసి చంటి, నరసింహులు, రమేష్ శ్రీనివాస్, రవి, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

నల్ల చట్టాలను రద్దు చేయాలి : దేవేందర్

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతులకు వ్యతిరేకంగా తీసుకు వచ్చిన నల్ల చట్టాలను రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ డిమాండ్ చేశారు. కార్మిక చట్టాల నిర్వీర్యం, వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేయాలని, కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి, ఆదిలాబాద్ జిల్లాకు జరిగిన అన్యాయంపై బుధవారం కలెక్టరేట్ ఎదుట కేంద్ర కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హోరెత్తించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలతో పాలన సాగిస్తోందన్నారు. రైతులకు అన్యాయం చేసేలా మూడు నల్ల చట్టాలను తీసుకు వచ్చిందన్నారు. ఇందులో ఆయా సంఘాల నాయకులు అగ్గిమల్ల స్వామి, లోకారి పోశెట్టి, జగన్‌సింగ్, దేవిదాస్, అశోక్, వెంటక నారాయణ పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలు కల్పించాలని ఉత్తరాలు

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మావల శివారులోని సర్వే నెం.170 పరిధిలోని కొమురంభీం కాలనీవాసులకు సౌకర్యాలు కల్పించాలని తుడుందెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ గోడం గణేష్ డిమాండ్ చేశారు. బుధవారం కాలనీ నుంచి హెడ్ పోస్ట్ ఆఫీసు వరకు పాదయాత్రగా వచ్చారు. ఇక్కడి నుంచి ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా, ప్రధాన మంత్రి, ఎస్టీ కమిషన్, తెలంగాణ గవర్నర్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, తెలంగాణ సీఎంకు పోస్టుకార్డులను వేశారు. సమస్యలను విన్నవిస్తూ పరిష్కరించేలా చూడాలని కార్డు ద్వారా పంపించారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ గోడం గణేష్ మాట్లాడుతూ అడవిబిడ్డలు పట్టణంలో అవాసం ఏర్పాటు చేసుకున్నారన్నారు. కానీ పాలకులు, అధికారులు వారికి ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. ఏడు దశాబ్దాల నుంచి అక్కడే గుడిసెలు వేసుకొని ఉంటున్న తమను పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో వెట్టి మనోజ్, దాదిరావు, సుబన్, రేణుక, వరుణ్, ఇంద్ర, తదితరులున్నారు.

'డీసీసీబీ'.. మరో ఆరు నెలలు?

(5వ పేజీ తరువాయి...)

పదవీకాలం పొడగింపు కచ్చితంగా ఉంటుందన్న చర్చ జరుగుతోంది. అయితే బీఆర్ఎస్ పార్టీని వదిలి కాంగ్రెస్ పార్టీలో చేరిన సీనియర్ నేత డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి రాజకీయ భవిష్యత్తుపై సర్వత్రా ఉత్కంఠ కనిపిస్తోంది. మళ్లీ డీసీసీబీ చైర్మన్ పదవీ రెన్యువల్ అవుతుందా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తానికి ఏదో ఒక నామినెట్ పదవి ఆయనకు దక్కడం ఖాయమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే కాంగ్రెస్‌లో ఎప్పుడు? ఏం జరుగుతుందో? చెప్పలేని పరిస్థితులు ఉంటాయని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఖోడద్‌లో యువకుడి ఆత్మహత్య

తలమడుగు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖోడద్ గ్రామానికి చెందిన యువకుడు ఉరివేసుకొని మృతి చెందినట్లు తలమడుగు ఎస్ఐ అంజమ్మ తెలిపారు. వివరాల ప్రకారం.. మండలంలోని ఖోడద్ గ్రామానికి చెందిన దెబ్బడి ప్రవీణ్(30) అనే యువకుడు తాగుడుకు బానిసై తాగిన మైకంలో ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబీకులు తెలిపారు. మృతుడు మద్యానికి బానిసై.. కూలి పనిచేయ నందున జీవితంపై విరక్తి చెంది ఉరేసుకున్నట్లు కుటుంబీకులు తెలిపారు. భార్య కల్యాణి ఫిర్యాదు మేరకు ఎస్సై బి.అంజమ్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గంజాయి మొక్కలు పెంచిన వ్యక్తి పై కేసు

బోథ్/ బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): బజార్‌హత్నూర్ మండలంలోని హస్నాపూర్ గ్రామానికి చెందిన మాది శ్రీరామ్ అనే వ్యక్తి ఆలయంలో గంజాయి విత్తనాలు వేసి ఆలయ ఆవరణలో మొక్కలను పెంచినందుకు ఆయనను బుధవారం అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు. గత నెల 24న గంజాయి మొక్కలను గుర్తించి సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. దీంతో బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ వివరించారు.

వ్యక్తి మృతికి కారణమైన ఒకరి రిమాండ్

బోథ్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిప్పలదరి గ్రామానికి చెందిన బండారి చంద్రకాంత్ శనగ పంట చుట్టూ విద్యుత్ కంచె ఏర్పాటు చేయడంతో విద్యుత్ షాక్‌తో మిశ్రమ కృష్ణ ఈనెల 2న మృతి చెందాడు. దీంతో స్థానిక ఎస్సై ప్రవీణ్ కుమార్ కేసు నమోదు చేశారు. అయితే వ్యక్తి మృతికి కారణమైన చంద్రశేఖర్‌ను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు. పంటలను కాపాడేందుకు ఎవరైనా విద్యుత్ తీగలను అమర్చినట్లయితే చట్టపరమైన కేసులు తప్పవని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు.

బోథ్‌లో గుండెపోటుతో అధ్యాపకుడి మృతి

బోథ్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): బోథ్‌లోని మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలలో ఇంగ్లీష్ పీజీటీగా పనిచేస్తున్న దేవరాజు బుధవారం సాయంత్రం తరగతి గదిలో బోధిస్తుండగా గుండెపోటు గురయ్యారు. దీంతో ఆయన తోటి ఉపాధ్యాయుడికి తనకు ఇబ్బందికరంగా ఉందని ఆసుపత్రికి వెళ్లి వద్దామని పేర్కొన్నట్లు తెలిసింది. దీంతో సదరు ఉపాధ్యాయుడు బోథ్ ఆసుపత్రికి తీసుకొని వెళ్లగా డాక్టర్ పరిశీలించి మందులు రాసి ఇచ్చినట్లు తెలిసింది. వెంటనే మరోసారి గుండెనొప్పి రావడంతో ఆయన మృతి చెందాడు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : సీఐ

బోథ్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సీఐ వెంకటేశ్వరరావు కోరారు. బుధవారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు మత్తు పదార్థాలను స్నేహితులతో కలిసి తాగి అలవాటుగా మారి ఆ తర్వాత బానిసలు అవుతున్నారని, తద్వారా ఆరోగ్యం చెడిపోవడంతో పాటు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చలేరన్నారు. గంజాయి, డ్రగ్స్ వినియోగం మద్యానికి బానిసవ్వడం వంటి దురాలవాట్లు విద్యార్థుల జీవితాలను నాశనం చేస్తున్నాయన్నారు. ఎంతో మంది విద్యార్థులు తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. సమావేశంలో బోథ్ ఎస్సై ప్రవీణ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ సంగీత, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన నోడల్ అధికారి



కుంటాల ఆదర్శ మాడల్ పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న నోడల్ ప్రిన్సిపల్ శ్రీనివాస ప్రసాద్

కుంటాల, ఫిబ్రవరి 5 : (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాల స్థానిక ఆదర్శ మాడల్ పాఠశాలలో బుధవారం నిర్మల్, ఆదిలాబాద్ ఆదర్శ పాఠశాలల నోడల్ ప్రిన్సిపల్ శ్రీనివాస ప్రసాద్ తనిఖీ చేశారు. తరగతి గదుల్లో విద్యార్థులకు అందించే బోధన తీరును పరిశీలించారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాల స్థాయి పెంపు, ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాల పరిశీలన, మధ్యాహ్న భోజనం, రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నార్నూర్ ప్రిన్సిపల్ ప్రశాంత్, బజార్‌హత్నూర్ ప్రిన్సిపల్ సంగీత, స్థానిక ప్రిన్సిపల్ నవీన్, తదితరులు ఉన్నారు.

బడుగు బలహీన వర్గాల కోసమే కాంగ్రెస్ పార్టీ

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : బడుగు, బలహీన వర్గాల కోసం ఎల్లప్పుడు ముందుకు సాగేదే కాంగ్రెస్ పార్టీ అని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ ప్రచార కమిటీ సమన్వయకర్త ఎంబడి రాజేశ్వర్ అన్నారు. బుధవారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కుల గణన గురించి బీసీ కుటుంబాల వారు ఎటువంటి అపోహాలకు వెళ్లవద్దని తెలిపారు.

చిరుత దాడిలో బాధితుడికి పరిహారం అందజేత



బాధితుడికి పరిహారం అందిస్తున్న ఫారెస్ట్ అధికారులు

పెంబి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వస్‌పల్లి అటవీ ప్రాంతంలో గత 6 నెలల క్రితం చిరుత పులిదాడిలో నైతం రాజుకు చెందిన లేగ దూడ మృతి చెందడంతో బుధవారం బాధిత కుటుంబానికి 12 వేల నష్టపరిహారం చెక్కును పెంబి ఎఫ్‌ఆర్‌వో రమేష్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పశువులపై వన్యప్రాణులు దాడి చేస్తే వెంటనే ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షణ జరుపుతున్నామన్నారు. అటవీ జంతువులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని, రైతులు పంట పొలం చుట్టూ విద్యుత్ కంచెలు ఏర్పాటు చేయరాదని, ఒకవేళ ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. వన్యప్రాణులను సంరక్షించడం మనందరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఆర్‌వో గీత, ప్రతాప్ నాయక్, ఎఫ్ఎస్‌వో సుందర్, ఎఫ్‌బీవో కిరణ్, శివ, ఆశిష్, తదితరులు ఉన్నారు.

'పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలి'

కుంటాల, ఫిబ్రవరి, 5 : (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో పారిశుధ్య పనులు, ఇంటి పన్నుల వసూళ్లు, నర్సరీలలో మొక్కల పెంపకం, ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేకదృష్టి సారించాలని ఎంపీడీవో లింబాద్రి అన్నారు. బుధవారం కుంటాల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో తడి, పొడి చెత్తల సేకరణ వేరు వేరుగా నిర్వహించాలని, ఇంటిపన్నుల వసూళ్లు వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో అబ్దుల్‌రహీం, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు ఆమోదయోగ్యమైన బడ్జెట్



భైంసాలో ప్రధానిమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

భైంసా, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యమైన బడ్జెట్ అని బీజేపీ భైంసా పట్టణ కమిటీ అధ్యక్షుడు ఎనుపోతుల మల్లేశ్వర్, రాష్ట్ర నాయకులు నిజాం వేణుగోపాల్, మిర్జాపూర్ పీఏసీఎస్ డైరెక్టర్ వడ్నపు శ్రీనివాస్, బీజేవైఎం ముథోల్ అసెంబ్లీ కన్వీనర్ ముల్లవార్ అనిల్‌లు పేర్కొన్నారు. బుధవారం భైంసా బస్టాండ్ ఎదుట జనరంజకమైన బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భాన్ని పురస్కరించుకొని ప్రధాని మోదీ చిత్ర పటానికి పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన పాలాభిషేకం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పేద,మధ్య తరగతి ప్రజల ప్రయోజనార్థం, రైతుల సంక్షేమం కోసం, యువత ఉపాధి కోసం బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యతనిచ్చిందన్నారు. బడ్జెట్ కేటాయింపులు వికసిత్ భారత్ ప్రతిరూపంగానున్నాయని పేర్కొన్నారు. వార్షికాదాయం రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు ఇవ్వడం ఎంతో గొప్ప పరిణామం అని తెలిపారు. రాబోయే ఐదేళ్లలో వృద్ధికి 6 కీలక రంగాలను బడ్జెట్ గుర్తించిందన్నారు. కేంద్ర బడ్జెట్‌పై విపక్షాలు అనవసర,అర్థరహిత ఆరోపణలు, విమర్శలు మానుకోవాలని, కేంద్రానికి సహకరించాలని సూచించారు. ఇందులో పార్టీ ప్రతినిధులు రావుల పోశెట్టి, గౌతం పింగ్లే, రావుల రాము, లింగోజీ, మాణిక్ దగ్దే, గాలి రాజుతో పాటు పట్టణ పరిధిలోని ఆయా వార్డుల పార్టీ ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

భైంసా రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : భైంసా మండలంలోని కోతుల్‌గాం గ్రామంలో బుధవారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై సంతోషం వ్యక్తం చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు సీరం సుష్మరెడ్డి మాట్లాడుతూ... ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పేదల సంక్షేమం కోసం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తున్నా రన్నారు. కాంగ్రెస్ నాయకులు కేంద్ర బడ్జెట్‌పై తప్పుడు మాటలు మాట్లాడటం సరికాదన్నారు. బీజేపీ పార్టీ మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యమిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు సాయి, మాజీ ఉప సర్పంచ్, బూత్ ఇన్‌చార్జీలు తిరుపతి, లింగం, నాయకులు భోజారాం పటేల్, బిజ్జూర్ గ్రామ బూత్ అధ్యక్షులు రమేష్, సీనియర్ నాయకులు నాగన్న, బీజేపీ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌ను నిరసిస్తూ ప్రతుల దహనం



కేంద్రప్రభుత్వ బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న దృశ్యం

నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం రైతులను, కార్మికులను, దేశ పేదలను పక్కనపెట్టి కార్పొరేట్ అనుకూల బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల నాయకులు కే. రాజన్న, ఎస్.విలాస్, నూతన్‌కుమార్, నందిరామయ్య, ఎస్ఎన్ రెడ్డి, రాజు, ఎస్. రాజేష్‌లు విమర్శించారు. బుధవారం సంయుక్త కిసాన్‌మోర్చా ఇచ్చిన పిలుపులో భాగంగా జిల్లా కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం దేశంలో నిరుద్యోగం పెరిగిపోతూ ఉంటే, రైతాంగం తమకు పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని, మా రుణాలన్నింటిని మాఫీచేయాలని డిమాండ్ చేస్తూ ఉంటే వాటి గురించి కనీసం బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం దారుణమని విమర్శించారు. ప్రధానంగా దేశవ్యాప్త నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ప్రభుత్వ ప్రైవేట్ రంగాల్లో పరిశ్రమల రూపకల్పనకు ఉపాధి పెంచే చర్యలు చేపట్టకపోవడం, మరోవైపు కార్పొరేట్లకు అనేక రాయితీలు ప్రకటిస్తూ బడ్జెట్‌ను రూపొందించడం ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాన్ని సూచిస్తుందని విమర్శించారు. ఉపాధి హామీ లాంటి పథకాలకు నిధులను పెంచకుండా ప్రభుత్వం తగ్గించుకుంటూ పోతూ వస్తుంది. కనీసం 200ల రోజుల పని, రోజుకు 600ల రూపాయలు కూలీని ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం. ప్రభుత్వం అప్పులు ప్రభుత్వ బడ్జెట్‌ను మించిపోయాయని, ఈ అప్పులు కార్పొరేట్ల రుణాల మాఫీ కోసం కాదా అని ప్రశ్నించారు. తక్షణమే రైతు కార్మిక ప్రజా అనుకూల బడ్జెట్లను మారచవలసిన అవసరం ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు ఎం. బక్కన్న, రామ్‌లక్ష్మణ్, తిరుపతి, లింగన్న, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ వై జంక్షన్ వద్ద రక్షణ చర్యలు చేపట్టాలి



వినతిపత్రం అందజేస్తున్న కడ్తాల్ గ్రామస్థులు

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : సోన్ మండలంలోని కడ్తాల్ వై జంక్షన్ వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌కు బుధవారం గంజాల్ మాజీ సర్పంచ్ లావణ్య నవీన్ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వై జంక్షన్ రక్షణ చర్యలు లేకపోవడంతో రక్షణ చర్యలు చేపట్టి నిర్మల్ పట్టణానికి వెళ్లడానికి వీలు కల్పించాలని తెలిపారు. వై జంక్షన్ వద్ద నిర్మల్ పట్టణానికి వెళ్లకుండాజాతీయ రహదారి నుంచి కొండాపూర్ మీదుగా నిర్మల్ వెళ్లే విధంగా రోడ్డు మళ్లించారు. దీని వల్ల ప్రజలకు దూర భారం వ్యయ ప్రయాసలకు గురికావాల్సి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ మాజీ కౌన్సిలర్ రఫీ అహ్మద్ ఖురేషి, మాజీ ఉప సర్పంచ్ గంగయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

జాతరకు ముస్తాబైన

శెట్‌పల్లి నరసింహస్వామి ఆలయం

● రేపు 16వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు



జాతరకు ముస్తాబైన నరసింహస్వామి ఆలయం

పెంబి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శెట్‌పల్లి నరసింహ స్వామి ఆలయం జాతరకు ముస్తాబైంది. ప్రతి సంవత్సరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. 16వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు శుక్రవారం వేద పండితులచే ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఉత్సవాలను విజయవంతం చేయండి



కుంటాలలో గజ్జలమ్మ వార్షికోత్సవ పోస్టర్లను విడుదల చేస్తున్న గ్రామస్థులు

కుంటాల, ఫిబ్రవరి 5 : (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు నిర్వహించే కుంటాల గజ్జలమ్మ 5వ వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. మూడు రోజుల పాటు అంగరంగవైభవంగా ఉత్సవాలు కొనసాగుతాయని గ్రామస్థులు తెలిపారు. మొదటి రోజు ఉదయం నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాల్లో భాగంగా భగవతి ప్రార్థన, విశేష సంకల్పము, మహా గణపతి పూజ, పుణ్యాహవచనము, యాగశాల ప్రవేశము, సంస్కారము, వాస్తు క్షేత్ర పాలక నవగ్రహ, యోగిని, కర్కరీ సర్వతోభద్ర మండల స్థాపన, అగ్ని ప్రతిష్ఠ స్థాపిత హోమము గ్రామస్తులచే జలాభిషేకము, కుంకుమార్చన, హారతి మంత్ర పుష్పము, 10వ తేదిన నిత్యనిధి యజ్ఞ కార్యక్రమం, గజ్జలమ్మ కల్యాణం, రథోత్సవం, హారతి, మంత్రపుష్పము, 11వ తేదిన పూర్ణాహుతి, హారతి, కుంభాభిషేకం, గ్రామస్తులచే బోనాల సమర్పణ తదితర కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు తెలిపారు. బుధవారం ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆలయ ప్రాంగణంలో నిర్వాహకులు విడుదల చేశారు.

బుద్ధవిహార్ నిర్మాణానికి భూమిపూజ



సారంగాపూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో గల ఊరగుట్ట మీద బుధవారం బుద్ధవిహార్ నిర్మాణానికి బంతేజి అశ్వం త్‌తో పాటు మరో 50 మంది బంతేజిలు ప్రత్యేకపూజలు చేసి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో నక్కరాజన్న, ప్రదీప్, ప్రవీణ్, గైక్వాడ్, అరుణతో పాటు తదితరులు ఉన్నారు.



పగుళ్లు తేలిన భాగాన్ని తొలగించి కొత్తగా చేపట్టిన నిర్మాణం

అధికారులు స్పందించారు.. మరమ్మతులు చేపట్టారు!

ఆదిలాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కైలాస్‌నగర్‌లో నిర్మిస్తున్న ఆడిటోరియం పనుల్లో నాణ్యత కరువైందంటూ ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన "పునాదుల్లోనే పగుళ్లు" అనే వార్త కథనానికి అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టారు. బుధవారం మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు క్షేత్ర స్థాయిలో జరుగుతున్న పనులను పరిశీలించి పగుళ్లు తేలిన పనులను తొలగించాలని ఆదేశించడంతో సంబంధిత కాంట్రాక్టర్ హుటాహుటిన పగుళ్లు తేలిన పునాది భాగాన్ని తొలగించి కొత్త నిర్మాణాన్ని చేపట్టారు. ఇకపై పనులను నాణ్యతగా చేపట్టకుంటే కాంట్రాక్టర్‌కు బిల్లుల చెల్లింపులను నిలిపి వేస్తామని మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు పేర్కొన్నారు.



పునాదిలో పగుళ్లు తేలిన భాగాన్ని తొలగించిన దృశ్యం

అడుగంటుతున్న భూగర్భ జలాలు

● పాతాళంలో వెతికినా చుక్క నీరు రాని వైనం ● సాగునీటికి తప్పని తిప్పలు



ఇటీవల రైతు తవ్వించిన బోరు బావి

బోథ్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో భూగర్భ జలాలు వేగంగా అడుగంటుతున్నాయి. ఫలితంగా రబీ పంటలు వేసిన రైతులు సాగునీటి కష్టాలు ఎదుర్కొనగా తప్పడం లేదు. సాగునీటి కోసం బోర్ బావులను విచ్చలవిడిగా తవ్వుతున్న ఫలితాలు లేకపోవడంతో రైతులు ఆందోళన గురవుతున్నారు.

● భూగర్భ జలాల పెంపు అత్యవసరం

వేగంగా భూగర్భ జలాలు అడుగంటి పోతుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 80 శాతం మంది రైతులు వర్షాధార పంటలపై ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారు. అయితే భూగర్భ జలాలను వినియోగించుకొని కేవలం 20 శాతం మంది రైతులు పండిస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల భూగర్భ జలాలపై ఆధారపడ్డ రైతులు భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తక తప్పదని పరిశీలకులు అంటున్నారు. అయితే నీటి వనరుల పెంపు కోసం వీలున్న చోటల్లా చెక్ డ్యాములు కుంటలు, చెరువులు, నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొంటున్నారు. లేకపోతే రైతులు పుడమి తల్లి నిండా బోరు బావులు వేసిన నీటి జడలు కనిపించని పలువురు పేర్కొంటున్నారు.

పాతాళంలోకి తవ్వినా చుక్కనీరు లేదు



● మునిగల రమేష్, రైతు

మండలంలోని కనుగుట్ట గ్రామానికి చెందిన రైతు మునిగేల రమేష్ తనకున్న భూమిలో సాగునీటి కోసం గత 15 రోజుల క్రితం బోరు బావిని తవ్వించారు. అయితే మండలంలోని రైతులు భూగర్భ జలాల కోసం 300 ఫీట్ల లోతులకు తవ్విస్తుంటారు. ఈ రైతు మాత్రం 750 ఫీట్ల లోతులో బోరుబావి తవ్వించిన చుక్క నీరు లభించకపోవడంతో రైతు లక్ష రూపాయలకు పైనే ఖర్చు చేసిన నీటి జాడ కనిపించలేదు. మండలంలో అత్యధికంగా లోతుగా బోరు బావి తవ్వించిన ఒకే ఒక్క రైతు ఈయన దీంతో మండలంలోని రైతులు సాగునీటి కోసం భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తే ఆస్కారం ఉందని వాపోతున్నారు.

● పడిపోతున్న నీటి నిలువలు

మండలంలో భూగర్భ జలాల పై నమ్మకంతో ప్రస్తుతం వందలాది మంది రైతులు రబీ పంటలను సాగు చేస్తున్నారు. గత పది రోజుల నుండి నీటి నిలువలు అడుగంటి పోవడంతో రైతుల కళ్ళముందే చేతికి అందే పంటలు ఎండిపోతాయని అంటున్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం ఆందోళనలు

● భైంసా ప్రధాన రోడ్డు మార్గంలో లబ్ధిదారుల రాస్తారోకో ● ఆర్డీవో, తహసీల్దార్ల నిలదీత



ప్రధాన రోడ్డు మార్గంలో రాస్తారోకో చేస్తున్న లబ్ధిదారులు



ఆర్డీవో కోమల్‌రెడ్డిని నిలదీస్తున్న డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు

భైంసా, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : లక్కీ డ్రా ద్వారా ఎంపికైన తమకు ఇండ్లు కేటాయించే విషయంలో అధికార యంత్రాంగం అవలంబిస్తున్న కాలయాపన విధానాలను నిరసిస్తూ భైంసా పట్టణ డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు బుధవారం చేపట్టిన ఆందోళనలు హోరెత్తాయి ఉదయం వేళలో స్థానిక విశ్రాంతి భవనం వద్ద బేటి అయిన లబ్ధిదారులు ముందుగా నిరసన ర్యాలీ చేపట్టి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ తహసీల్దార్ ప్రవీణ్ కుమార్‌కు సంబంధిత విషయంలో వినతి పత్రం అందచేశారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా బస్టాండ్ రోడ్డు మార్గం వైపు వెళ్లి ప్రధాన రోడ్డుపై భైఠాయించి రాస్తారోకో చేపట్టారు. వాహనాల రాకపోకలను అడ్డుకొని ట్రాఫిక్ వ్యవస్థను స్తంభింప చేశారు. సంబంధిత సమాచారం అందుకున్న టౌన్ సీఐ గోపీనాథ్ పోలీసు సిబ్బందితో హుటహుటిన ఘటన స్థలికి చేరుకొని ఆందోళనకారులను సముదాయించేందుకు విఫలయత్నం చేశారు. రెండు సంవత్సరాల కాలంగా రేపు,మాపు అంటూ కబుర్లు చెబుతూ తమకు ఇండ్లు కేటాయించే విషయంలో ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యపూరిత దోరణి విధానాలతో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారంటూ ఆందోళనకారులు టౌన్ సీఐ గోపినాథ్‌కు వివరించారు. ఆందోళనలు విరమిస్తే అధికారులు వచ్చి మాట్లాడుతారని టౌన్ సీఐ గోపినాథ్ పేర్కొనగా లబ్ధిదారులు ససేమిరా అన్నారు. తమకు ఇండ్లు కేటాయించే ప్రక్రియ చేపట్టేంత వరకు ఇక్కడి నుంచి కదలబోమని స్పష్టం చేశారు. ఈ విషయంలో ఆందోళనకారులు టౌన్ సీఐ తో వాగ్వాదానికి దిగారు. పరిస్థితి తీవ్రతరమవుతున్న సమాచారం అందుకున్న అర్‌డీవో కోమల్ రెడ్డి, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్‌లు ఆందోళన స్థలికి చేరుకొని లబ్ధిదారులను సముదాయించేందుకు యత్నించారు. ఇందుకు లబ్ధిదారులు అడ్డుకొని ప్రతి పర్యాయం ఏదో వాయిదా వేస్తూ కాలం వెళ్లదీస్తున్నారే తప్ప కేటాయింపులకు సంబంధించి ఎలాంటి చర్యలు చేపట్టడం లేదంటూ లబ్ధిదారులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేసి నిలదీసారు. ప్రభుత్వానికి, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేస్తూ అందోళనలను హోరెత్తించారు. చివరకు అర్‌డీవో కోమల్ రెడ్డి, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, టౌన్ సీఐ గోపినాథ్‌లు పలు విధాలుగా సముదాయించి ఆందోళనకారులను సముదాయించారు. డబుల్ బెడ్ రూమ్ గృహ సముదాయలకు మౌళిక వసతుల కల్పన, అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు గాను నిధులు విడుదలైనట్లుగా తెలిపారు. రెండు నెలల్లోగా సంబంధిత పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియ నిర్వహింప చేసి పనులు పూర్తి చేయించి ఇండ్లు అందచేస్తామని వివరించడంతో లబ్ధిదారులు తమ ఆందోళనలను విరమించారు.



ఆందోళన చేస్తున్న డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు

బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : బేటీ బచావో - బేటీ పడావో ఉత్సవాల్లో భాగంగా బాలల హక్కుల పరిరక్షణపై పట్టణంలోని కేజీబీవీ బాలికల పాఠశాలలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఛైర్మన్ జి. రాధిక బుధవారం విద్యార్థులకు అగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు లింగ సమానత్వం, ఆడపిల్లల చదువు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బాలికల అత్యవసర సేవల కోసం 100, 1098, 181, 1930 వంటి హెల్ప్‌లైన్‌లను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీపీవో మురళి, మిషన్ శక్తి జెండర్ స్పెషలిస్ట్ జ్యోతి, హెల్ప్‌లైన్ అధికారి శ్రీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శనగ పంటకు తెగుళ్లు



తెగుళ్ళు సోకిన శనగ పంట

తాంసి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): శనగ పంట సైతం రైతులను ఆదుకోనేలా కనిపించడం లేదు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పటికీ విత్తనాల లోపమో లేక మరి ఏదో తెలియదు గానీ ఆశించిన స్థాయిలో పెరగలేదని రైతులు అంటున్నారు. మరో 15 నుంచి 20 రోజుల్లో కోతకు వచ్చే ఈ పంటకు తెగులు సైతం సోకుతున్నాయని పేర్కొంటున్నారు. ఖాతా సైతం అంతంత మాత్రమేనని అంటున్నారు. సకాలంలోనే పంటలకు కావలసిన పురుగు మందులు, ఎరువులను వేసినప్పటికీ ఎందుకు ఆశించిన స్థాయిలో లేవో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. ముందుగా ఎకరానికి కనీసం ఏడు నుంచి పదికింటల దిగుబడి వస్తుందని ఆశించారు. కానీ ప్రస్తుతం పంటలను చూస్తే మూడు నుంచి ఐదు క్వింటాళ్ళ దిగుబడి కూడా మెండేనని వాపోతున్నారు. ఖరీఫ్‌లో పత్తి పంట తీవ్ర నష్టాన్ని కలిగించగా రబీలో వేసిన శనగ సైతం తమను ఆదుకోలేకపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



భైంసాలో గొడుగు నీడలో కొనసాగుతున్న పండ్ల విక్రయాలు

భానుడి భగభగలు

● పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు ● 36 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు

భైంసా, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలం అరంభమవ్వకముందే భానుడి భగభగలు మొదలయ్యాయి. మూడు రోజులుగా పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతూ పోతున్నాయి. ఎండల తీవ్రత పెరుగుతుండటంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. ఉక్కపోతతో అవస్థలు పడుతున్నారు. రెండు రోజులుగా జిల్లాలో పగటి పూట ఉష్ణోగ్రతలు 36 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు అయ్యాయి. ఇప్పుడే ఎండల పరిస్థితి ఇలా ఉంటే రాబోయే రోజుల్లో ఎండల పరిస్థితులను తలచుకుంటూ జనాలు బెంబేలెత్తిపోతున్నారు. పగటి పూట ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఈ సమయంలో బయటకు వెళ్లాలంలటే జనాలు జంకుతున్నారు. ఇక రాత్రి పూట ఏసీ, కూలర్లు, ఫ్యాన్ల వినియోగం పెరిగిపోయింది. సాధారణంగా మార్చి మాసంలో ఎండల బెడద మొదలయ్యి మే మాసంలో తీవ్రరూపం దాల్చుతుంది. ప్రస్తుతం శీతకాలం ముగియనే లేదు. అపుడే వాతవరణంలో పూర్తిగా మారిపోయింది. శివరాత్రి పర్వదిన ముగిసిన పిదప చలి తీవ్రత క్రమక్రమంగా తగ్గుముఖం పడుతుంది. కాని ఇప్పుడే చలి తీవ్రత అధిక శాతం తగ్గిపోయింది. పగటి పూట ఎండల బెడద అధికమయ్యింది.

● మూడు రోజులుగా ఉష్ణోగ్రతల్లో పెరుగుదల

జిల్లాలో మూడు రోజులుగా పగటి పూట ఉష్ణోగ్రతలు క్రమక్రమంగా పెరుగుతూ పోతున్నాయి. గత నెల చివరలో జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 31 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు అయ్యింది. ఇక ఈ నెల 1న 34 డిగ్రీలు, 2న 34 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు అయ్యియి. ఇక మంగళవారం రెండు డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరిగి 36 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు అయ్యాయి. గత సంవత్సరం ఇదే సమయంలో జిల్లాలో 32డిగ్రీల సెల్సియస్‌గా ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. పెరుగుతున్న ఎండల బెడదతో వీధి వ్యాపారులు, కూరగాయలు, పండ్ల వ్యాపారస్తులు గొడుగులను ఏర్పాటు చేసుకొని క్రయ, విక్రయాలను చేపడుతున్నారు. అక్కడక్కడ శీతల పానీయాల విక్రయ కేంద్రాలు మొదలయ్యాయి.



గొడుగు నీడలో కొనసాగుతున్న కూరగాయల విక్రయాలు

రామదూతాయ నమోస్తుతే

● 18 అడుగుల ధ్యాన హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపనకు ఏర్పాట్లు పూర్తి
● నేటి నుంచి ప్రత్యేక పూజలు ● ఈ నెల 8న విగ్రహ ప్రతిష్ఠ



భక్తి

కొలువుదీరనున్న ధ్యాన హనుమంతుడు



భక్తుల కోసం వేసిన శామియానా

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రామ దూత శ్రీ ధ్యాన హనుమాన్ స్వామి 18 అడుగుల ఏకశిలా విగ్రహ ప్రతిష్ఠాపనకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. కాల్వ అడవుల్లో కొలువైన శ్రీ కాల్వ లక్ష్మీ నరసింహస్వామి కోనేరు పక్కన ధ్యాన హనుమాన్ స్వామి కొలువు దీరనున్నారు. నిర్మల్ పట్టణానికి చెందిన అయిండ్ల చంద్ర మోహన్ రెడ్డి తన ఇష్టదైవమైన శ్రీ రామదూత హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపనకు సంకల్పించి సొంత ఖర్చులతో ధ్యాన హనుమాన్ విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు పూనుకున్నారు. నరసింహ స్వామివారి కోనేరు పక్కనే కొలువు దీరనున్న 18 అడుగుల ధ్యాన హనుమాన్ ఏకశిలా విగ్రహాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని ఆళ్లగడ్డలో అత్యంత నియమ నిష్ఠలతో తయారు చేయించారు. ఈ విగ్రహం పూర్తిగా రూపు దిద్దుకోవడానికి ఏడాది కాలం పట్టింది.

నేటి నుంచి ప్రత్యేక పూజలు


ధ్యాన హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమై శనివారం హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపనతో ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు. గురువారం నుంచి ప్రత్యేక పూజలు, యజ్ఞ యాగాదులు నిర్వహించనున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా తిరుపతి తదితర ప్రాంతాల నుంచి వేద పండితులను రప్పించారు. వారి కోసం ప్రత్యేకంగా గుడారాలను ఏర్పాటు చేశారు. తాత్కాలికంగా యాగశాలను నిర్మించారు. భక్తులకు శామియానాలను వేశారు. దాదాపు ఎనిమిది వేల నుంచి పది వేల మంది భక్తులు వస్తారన్నా అంచనాతో అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు ఉచిత అన్నప్రసాద వితరణకు అవసరమైన సరుకులు తెప్పించారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా కాల్వ

కాల్వ లక్ష్మీ నరసింహ స్వామి చెంతనే ధ్యాన హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపనతో ఆధ్యాత్మిక కేంద్రంగా కాల్వ రూపు దిద్దుకోనుంది. ధ్యాన హనుమాన్ స్వామి చెంత భక్తులు ధ్యానం చేసుకునేందుకు వీలుగా ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.



వేద పండితుల కోసం వేసిన ప్రత్యేక గుడారాలు



తాత్కాలికంగా నిర్మించిన యాగశాల

పరిపాలన సౌలభ్యం కోసమే నూతన మండలాల ఏర్పాటు

● ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా



భోరజ్ తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజర్షి షా



భోరజ్ తహసీల్దార్‌గా రాజేశ్వరి బాధ్యతలు స్వీకరిస్తున్న దృశ్యం

జైనథ్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పరిపాలన సౌలభ్యం కోసం నూతన మండలాల ఏర్పాటు జరిగిందని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం మండలాల ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా బుధవారం జైనథ్ మండలంలోని భోరజ్, సాత్నాల నూతన మండలాలకు సంబంధించిన తహసీల్దార్ ఎంపీడీవో ప్రభుత్వ కార్యాలయాలను ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా జిల్లా మండల అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా భోరజ్‌కు వచ్చిన జిల్లా కలెక్టర్‌ను పూలవర్షంతో పాటు డప్పులు భజాల మధ్య ప్రజలు అధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షాను పుష్పగుచ్ఛం శాలువాతో సత్కరించారు. భోరజ్ తహసీల్దార్‌గా రాథోడ్ రాజేశ్వర్‌ని భోరజ్ మండల ఎంపీడీవోగా వేణును, సాత్నాల మండల తహసీల్దార్ మడావి విశ్వనాథ్, ఎంపీడీవో వెంకట్ రాజ్‌లను కలెక్టర్ రాజర్షిషా సమ క్షంలో పూర్తి బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ శ్యామల దేవి, అసిస్టెంట్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వీయ, ఆదిలాబాద్ ఆర్డీవో వినోద్ కుమార్, జడ్పీ సీఈవో జితేందర్ రెడ్డి, కలెక్టరేట్ సుపరింటెండెంట్ రాంరెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.





భోరజ్‌లో కలెక్టర్ రాజర్షి షాకు స్వాగతం పలుకుతున్న ప్రజలు







'డీసీసీబీ'.. మరో 6 నెలలు?

- ఈనెల 15తో ముగియనున్న ఉమ్మడి జిల్లా డీసీసీబీ పాలకవర్గ పదవీ కాలం
- పక్కా హామీతోనే అడ్డి భోజారెడ్డి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలోకి..
- ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జీల మద్దతే కీలకం
- డీసీసీబీ రెన్యూవల్‌పై జిల్లా రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ

ఆదిలాబాద్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా డీసీసీబీ పాలక వర్గ పదవీ కాలాన్ని ప్రభుత్వం మరో ఆరు నెలల పాటు పొడగించే అవకాశం కనిపిస్తోంది. పాలకవర్గ పదవీ కాలం దగ్గర పడడంతో రాజకీయ వర్గాల్లో డీసీసీబీ పదవులపై విస్తృతమైన చర్చ కొనసాగుతోంది. అయితే పాత పాలక వర్గాన్నే మరికొన్నాళ్ల పాటు పొడగిస్తారా? లేక రద్దు చేసి ఎన్నికలు నిర్వహిస్తారా? అనేది హాట్‌టాపిక్‌గా మారింది. మరో పది రోజుల్లోనే పాలకవర్గ పదవి కాలం ముగిసి పోనుంది. ఫిబ్రవరి 15 చివరి గడువు సమయం కావడంతో ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ రేపుతోంది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపుగా 9మంది డీసీసీబీ చైర్మన్లు అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. దీంతో అంతా కలిసి ప్రస్తుతం ప్రభుత్వంపై ఒత్తిళ్లు తీసుకొస్తున్నట్లు తెలుస్తుంది. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున పాలకవర్గ పదవీ కాలం పొడగింపుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల సీజన్ దగ్గర పడడంతో ప్రభుత్వం ఆచితూచిగా అడుగులు వేసే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే డీసీసీబీ చైర్మన్ పనితీరుపై ప్రభుత్వం ప్రత్యేక నివేదికను తీసుకున్నట్లు తెలుస్తుంది. దీనాధారంగానే ప్రభుత్వ నిర్ణయం ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల సీజన్ ముగిసేంత వరకు డీసీసీబీ పాలక వర్గాల జోలికి వెళ్లకపోవడమే మంచిదన్న ఉద్దేశంతో ఉన్నట్లు తెలిసింది. ఆ తర్వాతనే డీసీసీబీకి ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందన్న ప్రచారం జోరుగా సాగుతోంది.

హైదరాబాద్‌లోనే మకాం

డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి గత వారం రోజులుగా హైదరాబాద్‌లోనే మకాం వేసి పార్టీలోని కీలక నేతలు, మంత్రులు, ఇతర ప్రముఖులను కలుస్తూ పాలకవర్గ పదవీ కాలం పొడగింపునకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. గత ప్రభుత్వ హయాంలో డీసీసీబీ చైర్మన్‌గా ఎన్నికైన అడ్డి భోజారెడ్డి అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. బోథ్ నియోజకవర్గానికి చెందిన అడ్డి భోజారెడ్డి ఆదిలాబాద్ నియోజకవర్గంలోనూ కీలకంగా వ్యవహరిస్తున్నాడు. అప్పట్లో పక్క హామీతోనే కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలుస్తుంది. ముఖ్యంగా కంది శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో అడ్డి భోజారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది. ఇచ్చిన మాట ప్రకారం డీసీసీబీ పాలకవర్గ పదవీ కాలాన్ని మరికొన్నాళ్ల పాటు కొనసాగించేందుకు కాంగ్రెస్ ఇన్‌చార్జిలు, పార్టీ అధిష్ఠానం సుముఖంగానే ఉన్నట్లు తెలుస్తుంది. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా 9మంది చైర్మన్లు ఒకే హామీతో కాంగ్రెస్‌లో చేరడం కూడా అడ్డి భోజారెడ్డికి అనుకూలంగా మారింది. ఒకచోట రెన్యూవల్ చేసి మరో చోట రెన్యూవల్ చేయకుంటే ఇబ్బందులు తప్పవన్న ఉద్దేశంతో అధిష్ఠానం పెద్దలు ఉన్నట్లు తెలుస్తుంది. కనీసం ఆరు మాసాల పాటైనా పదవీ కాలాన్ని పొడగించే అవకాశం ఉందన్న చర్చ సాగుతోంది.


● జిల్లా కేంద్రంలోని డీసీసీబీ బ్యాంకు

● ఇదే జిల్లా కేంద్రంలోని డీసీసీబీ బ్యాంకు (ఇన్‌సెట్‌లో చైర్మన్ అడ్డి భోజారెడ్డి

అందరి అభిప్రాయం మేరకే..

ఉమ్మడి జిల్లా పరిధిలోని డీసీసీబీ పాలకవర్గ పదవీ కాలాన్ని పొడగించేందుకు అందరి అభిప్రాయం తీసుకునే అవకాశం ఉంది. ఈ మేరకే ప్రభుత్వ నిర్ణయం ఉంటుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఉమ్మడి జిల్లా పరిధిలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, పార్లమెంట్ ఇన్‌చార్జి సత్తు మల్లేష్‌ల మద్ద తు కీలకంగా మారనుంది. వీరందరి అభిప్రాయం మేరకే ఏదో ఒక నిర్ణయం ఉంటుందని తెలుస్తుంది. చైర్మన్‌తో పాటు పలువురు డైరెక్టర్లు కాంగ్రెస్‌లో చేరిపోవడంతో ప్రభుత్వం పదవీ కాలాన్ని పొడగించేందుకు ఆసక్తి చూపే అవకాశం ఉంది. ఇదే జరిగితే మరో ఆరు నెలల పాటు పాలకవర్గం పదవులకు ఢోకా లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ అభిప్రాయాలను పరిగణలోకి తీసుకునే అవకాశం ఉంది. ఈ రెండు నియోజకవర్గాల్లోనూ చైర్మన్ అడ్డి భోజారెడ్డి ప్రభావం ఉంటుంది. దీంతో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇబ్బందులు తలెత్తకుండా పార్టీ అధిష్ఠానం జాగ్రత్త పడుతున్నట్లు పార్టీలో ప్రచారం జరుగుతుంది.

ధీమాలో అడ్డి భోజారెడ్డి

డీసీసీబీ పాలకవర్గ పదవీ కాలం పొడగింపుపై చైర్మన్ అడ్డి భోజారెడ్డి ధీమాతో ఉన్నట్లు తెలుస్తుంది. పార్టీలో చేరిన సమయంలోనే పార్టీ పెద్దలు పక్క హామీని ఇచ్చినట్లు చెబుతున్నారు. దీంతో ఎలాగైనా పదవీ కాలం రెన్యూవల్ అవుతుందన్న ధీమా వ్యక్తమవుతోంది. ఒకేసారి కాకుండా దశల వారీగా పదవీ కాలాన్ని పొడగించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది. ఏడాది కాకపోయినా ఆరు నెలల పాటు

(తరువాయి 6వ పేజీలో...)

కవ్వాల్ అభయారణ్యంలో రాత్రిపూట వాహనాల రాకపోకలకు గ్రీన్‌సిగ్నల్

● అడ్డుకోవద్దని పీసీసీఎఫ్‌కు మంత్రి ఆదేశాలు


అటవీ శాఖ మంత్రి కొండ సురేఖను కలిసిన ఎమ్మెల్యే

ఉట్నూర్, ఫిబ్రవరి5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని కవ్వాల్ అభయారణ్యం పరిధిలోని అటవీ శాఖ చెక్ పోస్టుల వద్ద రాత్రి 9గంటల నుంచి తెల్లవారు ఆరు గంటల వరకు వాహనాల రాకపోకలను అడ్డుకోకుండా అనుమతించాలని పీసీఎఫ్‌ను రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండ సురేఖ ఆదేశించినట్లు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తెలపారు. అటవీ శాఖ చెక్ పోస్టుల వద్ద అడ్డుకొంటున్న అటవీ అధికారుల చర్యలకు మంత్రి అడ్డుకట్ట వేశారన్నారు. రాత్రి వేళల్లో వాహనాల రాకపోకలను అడ్డుకోవద్దని సంబంధిత జిల్లాల అటవీ అధికారులకు సూచనలు జారీ చేయాలని రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ కంజర్వేటర్‌ను ఆదేశించారన్నారు. మంగవారం రాత్రి హైదరాబాద్‌లో ఎమ్మెల్యే బొజ్జు మంత్రిని కలిసి రాత్రి వేళల్లో అటవీ చెక్‌పోస్టుల వద్ద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి ఎప్పీపీటీ జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే ప్రాతినిధ్యంపై స్పందించిన మంత్రి కొండ సురేఖ ప్రజలకు అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలని రాత్రి వేళల్లో వాహణాల రాకపోకలకు అనుమతించాలని పీసీసీఎఫ్‌కు ఆదేశించారని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తెలిపారు. అటవీ శాఖ చెక్‌పోస్టుల వద్ద ప్రతీ రోజు ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు ఎమ్మెల్యే చూయించిన చొరవతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'సమన్వయంతో పని చేయాలి'

బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారవు సూచించారు. బజార్‌హత్నూర్ మండల సీనియర్ నాయకులు, బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సమక్షంలో బుధవారం హైదరాబాద్‌లో మాజీ మంత్రి కేటీఆర్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగ కలిశారు. ఈ సందర్భంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ముందంజలో నడిపించాలని, అందరూ కలిసికట్టుగా పనిచేసి పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని, కల్లబొల్లి మాటలు చెప్పి ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం తీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేటీఆర్ సూచించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చిల్కూరి భూమన్న, సాయి కృష్ణ, శరత్‌కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతికి సెలవు ప్రకటించాలి

● బంజారా జాతి నాయకుల డిమాండ్ ● బంజారాల పెళ్లిల్లో డీజేలు, ఫ్రీ వెడ్డింగ్‌లను నిషేధిస్తున్నట్లు నాయకుల వెల్లడి


సమావేశానికి హాజరైన బంజారా జాతి నాయకులు

ఉట్నూర్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఈనెల 15న జరగనున్న సేవాలాల్ జయంతి కార్యక్రమానికి ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని బంజారా జాతి నాయకులు డిమాండ్ చేస్తున్నారు. అదే విధంగా బంజారాల పెళ్లిలలో డీజే సౌండ్స్, ఫ్రీవెడ్డింగ్‌లు పూర్తిగా నిషేధిస్తున్నట్లు బంజారా నాయకులు ప్రకటించారు. బుధవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని జేసీఎస్ ఫంక్షన్‌హాల్‌లో వివిధ లంబాడా తండాల నుంచి వచ్చిన బంజారా జాతి నాయక్, కారోబారి, డావ్, గేరియా యువకుల సమావేశానికి భరత్‌చౌహాన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలు విప్లవాత్మక నిర్ణయాలకు ఉట్నూర్ మండల బంజారా పెద్దలు ఆమోదించి తూ.చా. తప్పకుండా ఈ నిర్ణయాలను పాటించాలని తీర్మాణం చేశారు. ఈ సందర్భంగా ఉట్నూర్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దేశ,రాష్ట్ర వ్యాప్తంగా శ్రీసంతు సేవాలాల్ మహరాజ్ జయంతిని ఫిబ్రవరి 15న ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని తీర్మానించామన్నారు. ఇక నుంచి బంజారా జాతీయుల పెళ్లి కార్యక్రమాలలో హల్ది ఫంక్షన్ నిషేధించడం జరిగిందన్నారు. అదేవిధంగా ఫ్రీ వెడ్డింగ్ ఫంక్షన్ కార్యక్రమాన్ని ఎట్టి పరిస్థితుల్లో నిర్వహించరాదని, నిషేధించడం జరిగిందన్నారు. అందుకు బదులు పోస్టు వెడ్డింగ్ (పెళ్లి జరిగిన తర్వాత) షూటింగ్ పెట్టుకోవాలని సూచించడం జరిగిందన్నారు. బంజారా సమాజంలో పెళ్లి శుభాకర్యం చేసేటప్పుడు సంప్రదాయం ప్రకారం పెళ్లిలు చేయాలని డీజే సౌండ్ సిస్టం ఉపయోగించారాదని కూడా తీర్మానం చేయడం జరిగిందన్నారు. అదే విధంగా ఈ నెల 15న జరగనున్న శ్రీసంతు సేవాలాల్ మహారాజ్ జయంతికి ఉత్సవ కమిటీని ఎన్నుకోవడం జరిగిందన్నారు. దీనిలో భాగంగా ధ్యక్షుడిగా జాదవ్‌మధుకర్, ఉపాధ్యక్షులుగా బానోత్ రవీందర్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా నరేష్‌చౌహాన్, కార్యదర్శి రాథోడ్‌రాజేష్‌నాయక్, కార్యదర్శి ఆడే రాజేశ్వర్, సంయుక్త కార్యదర్శి ప్రేమ్‌కుమార్, సంయుక్త కార్యదర్శి గుణవంతురావు, సంయుక్త కార్యదర్శి ఆడే అవినాశ్, సలహాదారులుగా పవార్ గంగారాంనాయక్, జాదవ్ గోపాల్‌రావు నాయక్, రాథోడ్ బీమ్‌రావునాయక్, ఆడే ధన్‌లాల్ నాయక్, ఆడే దినేష్, చంద్రకాంత్ జాదవ్, పవన్‌జాదవ్, ప్రేమ్‌సింగ్‌నాయక్, దేవరావునాయక్, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడిగా జాదవ్ బంకటలాల్, ఉపాధ్యక్షులు రామ్ నాయక్‌జాదవ్, ప్రధాన కార్యదర్శి మోబిలాల్, ఆడేసుభాష్‌నాయక్, కార్యదర్శిగా గురుసింగ్, సంయుక్త కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని భరత్‌చౌహాన్ ఈ సందర్భంగా వివరించారు.

కోలాం గిరిజన మహిళలు అభివృద్ధి సాధించాలి

ఉట్నూర్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని కోలాం గిరిజన మహిళలు స్వయం అభివృద్ధి సాధించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అన్నారు. బుధవారం మండలంలోని కోలాంగూడ గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహాఅభియాన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కోలాం గిరిజన మహిళలకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు అమలు చేసి దాల్మిల్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. సెడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఐదు రోజుల శిక్షణ కార్యక్రమంలో దాల్మిల్ యూనిట్‌ను ఎలా ఏర్పాటు చేసుకొని ఎలా అభివృద్ధి చెందాలో శిక్షణ పొందాలన్నారు. ఇందులో ఐటీడీఏ జేడీఎం నాగభూషణం, సెడ్స్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ సురేందర్, శ్యామలాదేవి, మాణిక్‌రావ్, మసూద్, తదితరులు పాల్గొన్నారు.

● మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా



బుగ్గారం(బి)లో క్రికెట్ ప్రీమియర్ లీగ్ టోర్నీ ప్రారంభం

నేరడిగొండ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుగ్గారం(బి) గ్రామంలో జరుగుతున్న బుగ్గారం ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ముఖ్యఅతిథిగా హాజరై టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువకులను మంచి మార్గంలో ప్రోత్సాహించడానికి ముందుంటానని అన్నారు. ఇందులో బోథ్ ఏఎంసీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, వైస్ చైర్మన్ ఆడే వసంత్ రావు, డైరెక్టర్ జాదవ్‌రూప్ సింగ్, రాజశేఖర్‌రెడ్డి, కపిల్‌దేవ్, మాజీ ఎంపీటీసీ మహేందర్, సద్దాం, శంకర్, హేమాజీ నాయక్, అనుపట్ల సంజీవ్, నారాయణరెడ్డి, తదితరులున్నారు.


టాస్ వేసి క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న ఆడే గజేందర్

అలాగే, నేరడిగొండల మండలంలోని బుగ్గారం గ్రామంలో కొలువైన భీమన్న దేవుడికి కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. కాగా, ఈనెల 12వ తేదీన బుగ్గారంలో గల భీమన్నగుట్టపై జాతర నిర్వహించనున్నారు.

అలాగే, నేరడిగొండ మండలం కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి పలువురు నాయకులకు కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోథ్ నియోజకవర్గ అభివృద్ధిలో తన వంతు కృషి చేస్తూ ఎన్నో కోట్ల రూపాయలతో నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పథంలో నడుపుతున్నందుకు గాను పార్టీలో చేరామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

● ప్రజాసేవకు పదవులు అవసరం లేదు

బోథ్: ప్రజాసేవ చేయాలన్న ఉద్దేశం ఉంటే ఏ పదవులు అవసరం లేదని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనను మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి గజేందర్ మాట్లాడుతూ నియోజకవర్గానికి రాష్ట్ర మంత్రి జిల్లా ఇంచార్జి మంత్రి అయిన సీతక్క చొరవతో 15 కోట్ల


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా

పుస్తకాలు చదవడంతో ఆలోచన శక్తి పెరుగుతుంది : కలెక్టర్

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పుస్తకాలు చదవడంతో జ్ఞానంతో పాటు ఆలోచన శక్తి పెరుగుతుందని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బుధవారం పట్టణంలోని గర్ల్స్ హైస్కూల్లో నేషనల్ బుక్స్ ఇండియా ఆధ్వర్యంలో మొబైల్ పుస్తక పరిశ్రమ వ్యాన్‌ను ఏర్పాటు చేశారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై వ్యాన్‌ను ప్రారంభించారు. అనంతరం అందులోని పుస్తకాలను పరిశీలించి అభినందించారు. అదేవిధంగా ఎన్ఆర్ఐ వాసుల తరఫున పాఠశాలలో ఏర్పాటు చేసిన లైబ్రరీని కలెక్టర్ ప్రారంభించారు. విద్యార్థులు నిత్యం పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జ్ఞానం, ఆలోచన శక్తి పెరగాలంటే నిత్యం పుస్తకాలు చదవాలన్నారు. మహనీయులు, స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్ర కలిగిన పుస్తకాలు చదివితే ప్రేరణ, గమ్యాలను చేరుకునే శక్తి వస్తుందన్నారు. నేషనల్ బుక్ ట్రస్ట్ ఇండియా నాలుగు రోజుల పాటు జిల్లాలో పుస్తక ప్రదర్శనతోపాటు అమ్మకాలు చేపడుతుందన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో ప్రణీత, ఎంఈవో సోమయ్య, లక్ష్మీపూర్ హెచ్ఎం కోరెడ్డి అశోక్, ప్రధానోపాధ్యాయుడు రమేష్‌రెడ్డి, సెక్టోరియల్ అధికారి సుజాత్‌ఖాన్, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

● నులిపురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

ఆదిలాబాద్ అర్బన్: ఈనెల 10న జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో ఆయన జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంనిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు అల్బెండజోల్ మాత్రలు తప్పకుండా వేసుకోవాలని సూచించారు. నులి పురుగుల నిర్మూలన దినోత్సవంలో 1నుంచి 19ఏళ్ల కలిగిన పిల్లలు, ప్రతీఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అలాగే ఈనెల 17న మోప్ అప్‌డే నిర్వహించి తప్పిపోయిన పిల్లలకు తిరిగి అల్బెండజోల్ మాత్రలు వేయడం జరుగుతుందని వివరించారు. ఇందులో ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్ మాలవీయ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నరేందర్‌రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్‌రాథోడ్, జిల్లా టీబీ నియంత్రణ అధికారి సుమలత, తదితరులు పాల్గొన్నారు.

● నేడు కొత్త మండలంలో కార్యాలయాల ప్రారంభం

బోథ్: నూతనంగా ఏర్పాటైన సోనాల మండలంలో ప్రభుత్వ కార్యాలయాలను గురువారం ప్రారంభించనున్నారు. కార్యాలయాల ప్రారంభోత్సవానికి కలెక్టర్ హాజరవుతారని అధికారిక వర్గాలను వారు తెలిపారు. ఇప్పటికే బోథ్ మండలంలోని తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయం నుంచి కొత్త మండల రికార్డులు, సామగ్రిని తరలించారు. అన్ని హంగులతో కార్యాలయాలను గ్రామస్థుల సహకారంతో ఏర్పాటు చేశారు.

మంత్రి సీతక్కను కలిసిన బోథ్ ఎమ్మెల్యే

నేరడిగొండ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గిరిజనుల సమస్యలపై మంత్రి సీతక్క ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొని స్థానిక సమస్యలను విన్నవించారు. ఆ తర్వాత ట్రైకర్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజనుల సమస్య లపై మంత్రి సీతక్క ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొని గిరిజనుల సమస్యలున వివరించారు. వీరితో పాటు పలువురు ఎమ్మెల్యేలు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బోథ్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న అన్ని గ్రామాలకు గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ తెలిపారు. సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని వినియోగదారులు సహకరించాలని కోరారు.


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): వర్గీకరణ ముప్పై ఏళ్ల పోరాట ఫలితమని, అనేక మంది ప్రాణాల త్యాగమని, దీంతో రాష్ట్ర ప్రభుత్వం కేటాగిరిలను విభజించడం హర్షణీయమని మాదిగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చందాల రాజన్న అన్నారు. అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణకు సంబంధించి 1, 2, 3 కేటాగిరిలను విభజించడాన్ని స్వాగతిస్తూ బుధవారం పట్టణంలో సంబరాలు జరుపుకున్నారు. అంబేద్కర్ చౌక్‌లో ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, మంద కృష్ణ మాదిగ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేసి టపాసులు పేల్చారు. ఈ సందర్భంగా మాదిగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చందాల రాజన్న మాట్లాడుతూ 30 ఏళ్లుగా మాదిగలు ఎస్సీ వర్గీకరణ కోసం ఉద్యమించారన్నారు. అసెంబ్లీ సాక్షిగా వర్గీకరణ చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి కేటాగిరిలను విభజించ డం హర్షనీయమన్నారు. ఇందులో మాదిగలకు 9, మాలలకు 5 శాతం ఇ చ్చారన్నారు. కానీ 18 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. వర్గీకరణ అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావించి కేటాగిరిలను ఏర్పాటు చేసిన సీఎంతో పాటు మంత్రులకు మాదిగల తరఫున ధన్యవాదలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బిక్కి గంగాధర్, అశోక్, సంజయ్, నాగన్న, మల్యాల మనోజ్, నక్క రాందాస్, దయాకర్, నవీన్, సాగర్ పాల్గొన్నారు.